
# దర్పణము

కొండ్రేగుల శ్రీనివాసరావు



నా చిన్నతనంలో ... ...

బహుశా అప్పుడు నా వయసు నాలుగ యిదేళ్లు అనుకుంటాను. నేను అతిగా ఏడ్చి మారాం చేస్తూ మా అమ్మని బాగా విసిగిస్తున్నపుడు నా చేతికో అద్దం ఇచ్చి నన్ను ఇంట్లో ఓ మూల కూర్చుండబెట్టి, ఆడుకో మని చెప్పి అమ్మ తన పనిలో తాను నిమగ్నమయ్యేది.

'అయ్యో...అదేంటి? చిన్న పిల్లాడి చేతికి అద్దం ఇస్తే పగలగొట్టడూ?' అని చూసిన వాళ్లు ఎవ రైనా అడిగితే –

'– ఫర్లేదు ఆడు కుంటాడు. వాడికి అల వాటే మరి!' అని సర్దిచెప్పేది.

చెక్కతో తయారు చేసిన చిన్న చేతి అద్దం అది. సంతల్లో అమ్మే వారు అప్పట్లో.

నా చేతిలో వున్న అద్దంలో ప్రతిబింబాన్ని చూస్తూ కూర్చుండేవాడిని. అద్దంలో దృశ్యాలు మారిపోతూ వుండేవి. అవి స్థిరంగా ఉండకుండా, ఎందుకు అలా మారిపోతూ వుండేవో ఆ వయసులో నాకు అంతు చిక్కేదికాదు.

కొన్నాళ్లు గడిచేక ఇంకొంచెం పెద్దయ్యాక అద్దం మీద నా అవగాహన పెరిగి, నేను చూడాలనుకునే దృశ్యాల్ని మాత్రమే చూసి ఆనందించేవాడిని.

ఇంటి పైకప్పు తాటాకు సందుల్లోంచి కనిపించే సూరీడు, నులక మంచమ్మీద కూర్చొని ఎడతెరపి లేకుండా దగ్గుతూ ఆయాసపడుతున్న మా తాతయ్య, వాకిట్లో కాళ్లు బార్లా చాపుకొని నాలిక బయటకు తీసి జాపోస్తున్న వీధికుక్క, పొయ్యిలో వెచ్చదనాన్ని ఆస్వాదించి బయటకొచ్చి బద్ధకంగా ఒళ్లు విరుచుకునే పిల్లి, మసిబారిన గోడల మీద మసకబారిన దేవుళ్ల పటాలూ, ఇలా ఎన్నెన్నో దృశ్యాలూ, దృశ్యమాలికలూ అద్దంలో తిలకిస్తూ కూర్చునేవాడిని.

అప్పట్లో నా సర్వస్వం, నాకున్న ఒక్కగాని ఒక్క నేస్తం అద్దమే.

వీధిలో ఎండని అద్దం ద్వారా చీకటింటిలోనికి ఫోకస్ చేస్తూ అప్పుడప్పుడు మనుష్యుల మొహాల మీద వేస్తూ, వాళ్లు చివాట్లని సరదాగా స్వీకరిస్తూ గడపటం బాల్యపు అనుభూతి.

టూరింగ్ టాకీస్ గోడ అవతల కట్ చేసి పారేసిన ఫిల్మ్ ముక్కల్ని ఏరి ఇంటినుండి తెచ్చుకుని, సూర్యకాంతిని అద్దంతో భూతద్దంలోంచి ఫోకస్ చేస్తూ, గోడమీద తల కిందులుగా పడే ఫిల్మ్ బొమ్మని సరిచేయడానికి అవస్థ పడుతూ, కదలని ఆ బొమ్మని కదిలేలా ఊహించుకుంటూ పరిసరాల్ని ఆ కాసేపు సినిమాహాలుగా మార్చేసి నేనూ- నా తోటి పిల్లలూ ఆడుకునే వాళ్లం. అద్దం అప్పట్లో నాకు వీడని బంధమై, నా బాల్యానికి అద్భుతమై నిలిచింది.

కౌమార్యం నుంచి యవ్వనంలోనికి ప్రవేశిస్తున్న రోజులవి.

అద్దంలో నా మొహమే అపురూపంగా అగుపించేదో, లేదా నా మొహానికి అద్దమే అపురూపమై నిలిచేదో తెలిసేది కాదు.

పెదవి మీద మొలకెత్తే మీసం, గెడ్డం దగ్గర అల్లా ఉద్దీన్‌ని గుర్తుకు తెచ్చే అరడజను వెంట్రుకలూ, మొహమ్మీద ఎక్కడ పడితే అక్కడ ఇష్టారాజ్యంగా మొలిచిన మొటిమలూ, వీటన్నిటినీ గోడకున్న పొడవాటి పెద్ద అద్దంలో ఎంతసేపు చూసుకున్నా, తనివి తీరేది కాదు.

తల దువ్వుకుంటున్నపుడో, పౌడర్ అద్దుకుంటున్నపుడో అలా చూస్తూ వుంటే చిత్రాతి చిత్రమైన ఊహలొచ్చేవి.

బాపుగారి సినిమాలో హీరోయిన్‌లా, పదహారణాల పడుచుదనంతో మా వీధిలో వుండే రాజ్యం, నా వెనుకే నిల్చొని తన పొడుగాటి వాలుజడతో, నా మెడని బంధించి ఆలుచిప్పలలాంటి కాటుక కళ్లతో నా భుజమ్మీదుగా అద్దంలోనికి చూస్తూ కళ్లతోనే సంభాషిస్తున్నట్లనిపించేది.

ఎదురింటి పంకజం నా వెనక నుంచి అద్దంలోకి ఓరకంటితో చూస్తూ మన్మధబాణాలు సంధిస్తూ కవ్విస్తున్నట్లనిపించేది.

అంతేకాదు వీధి చివర్న నూతి దగ్గర తెల్లారే వేళ పూజ కోసమని చంకలదాకా లంగాలు కట్టుకుని స్నానాలు చేసే ముద్దుగుమ్మల తడి అందాలూ, ఎప్పుడో స్నేహితులతో కలసి చూసిన అశ్లీల సినిమా దృశ్యాలూ గుర్తొస్తూ ఉక్కిరిబిక్కిరి చేస్తుండేవి.

నేనూ అద్దానికి అతుక్కుపోయి ఊహల్లో విహరిస్తున్నపుడు - ఒరే అన్నయ్యా! ఓ పని చేయకూడదూ? అద్దాన్ని చంకలో పెట్టుకుని కాలేజీకి పోరాదూ...' అని చెల్లాయ్ ఉడికిస్తూ ఆటపట్టించేది.

ఆ విధంగా యవ్వనంలో అద్దం పట్ల నా ఆసక్తి ఇనుమడించేది.

మధ్య వయసులో ఉద్యోగబాధ్యతలూ, పిల్లల చదువులూ సంసారపు బాదర బందీతో అద్దంలో మొహాన్ని చూసుకునే తీరిక ఓపిక ఉండేవికావు. అద్దంపట్ల నా ఆసక్తి కూడా మందగించింది.

అప్పుడప్పుడూ తల దువ్వుకోవడానికి, ఎప్పుడైనా గెడ్డం గీసుకోవడానికి తప్ప అద్దంతో పెద్దగా పనిపడేది కాదు.

ఇప్పుడు నా వయసు ఎనభై సంవత్సరాలు.

చూపు మందగించింది. శరీరం సహకరించటం లేదు.

మోకాళ్లచిప్పలు అరిగిపోయి వాపులొచ్చేస్తున్నాయి. బాత్రూమ్ కెళ్లాలన్నా ఎవరో ఒకరు సాయం వుండాల్సిందే!

ఇట్లాంటి సమయంలో ఎప్పుడైనా అద్దంలో మొహం చూసుకుంటే భయం వేసేది.

శుష్కించి ముడతలు పడిన శరీరం, పళ్లూడిపోయిన బోసి నోరు, లోతుకు పోయి చూపు మందగించిన కళ్లూ, లాంటి మార్పులతో ఆక్రమించేసిన వృద్ధాప్యం అద్దంలో భయపెట్టేది.

నా భార్య, నా సమకాలికులందరూ ఏదో పనున్నట్లు నిష్క్రమించారు. నేనొక్కడ్నే ఇట్లా మోడులా జీవచ్ఛవమై జీవిస్తున్నాను.

ఎప్పుడైనా ధైర్యం చేసి నన్ను నేను పరిశీలించుకుందామని అద్దంలోకి చూస్తే నా వెనక నుంచి మృత్యువు తొంగిచూస్తూ వికటాట్టహాసం చేస్తున్నట్లనిపించేది.

పోయిన నా వాళ్లంతా అద్దంలో కనిపిస్తూ పరామర్శిస్తున్నట్లు 'ఇంకా జీవితం మీద మమకారం ఎందుకు? త్వరగా వచ్చెయ్...' అని పిలుస్తున్నట్లు అనిపించేది.

అంటే నేను కూడా... ఇవ్వాళో... రేపో ...

మృత్యువు గుర్తుకు రాగానే భయంతో వణికిపోయేవాడిని. చిగురుటాకులా కదిలిపోయేవాడిని. అందుకే ఇప్పుడు అద్దం అంటే నాకు విపరీతమైన భయం.

బాల్యంలో అద్భుతమై అవతరించిన అద్దం, యవ్వనంలో ఆసక్తి అయి నా సహచరి అయింది. వృద్ధాప్యంలో భయవిహ్వలుణ్ణి చేస్తోంది. పాపం అది మాత్రం ఏం చేస్తుంది? ఎప్పుడూ వాస్తవాన్ని చూపించటమే దాని విధి. వాస్తవికతను అంగీకరించటానికి నా బోటివాడికి ధైర్యం కావాలి. జీవితానికి పరిపూర్ణత అయిన మృత్యువుని ఆహ్వానించగల పరిణతి రావాలి.

నాకు దర్పణం చెప్పిన జోస్యం ఇది.

★

